సాక్షి
నిర్మల్

సోమవారం । 20 । మే । 2024



పాటే ప్రాణం.. నటనే జీవనం!

పాటకు ప్రాణం పోస్తూ.. నటనలో జీవిస్తూ ఓ ప్రైవేట్ టీచర్ పల్లె ప్రజలను చైతన్యపరుస్తున్నాడు. సంస్కృతిని కాపాడుతూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు. 8లో▸



ఘనంగా బోనాల పండుగ

జిల్లాలోని పలుచోట్ల పెద్దమ్మ, రేణుక ఎల్లమ్మ తల్లికి భక్తులు బోనాలు సమర్పించారు. ముందుగా బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
39.0 /28.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

విద్యతోనే ఉన్నత స్థానాలు చేరుకోవచ్చు



శుభంగౌడ్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

భైంసాటౌన్: విద్యతోనే ఉన్నత స్థానాలు చేరుకోవచ్చని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లికి చెందిన 2023 యూపీఎస్సీ ర్యాంకర్ శుభంగౌడ్ పేర్కొన్నారు. పట్టణంలోని గురుకృప వొకేషనల్ జూనియర్ కళాశాలలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ముష్కం రామకృష్ణగౌడ్ అధ్యక్షతన ఆదివారం గౌడ వధూవరుల పరిచయ వేదిక నిర్వహించారు. కార్యక్రమానికి శుభంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరు కాగా, గౌడ సంఘం సభ్యులు అతడిని సన్మానించారు. ఈ సందర్భంగా శుభంగౌడ్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు వారి పిల్లలకు ఉన్నత విద్యనందించాలని తెలిపారు. విద్యతోనే గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహారాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షులు గోవింద్‌బాబాగౌడ్, గున్నాల వెంకట నర్సాగౌడ్, ఆదిలాబాద్ అధ్యక్షులు గున్నా రామకృష్ణగౌడ్, నర్సాగౌడ్, గంగాధర్‌గౌడ్, పండరిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



నియామకపత్రాలు ఇస్తున్న సాయన్న

నిర్మల్ రూరల్: పీఆర్టీయూ తెలంగాణ కార్యవర్గంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉమాకర్‌రెడ్డి, పార్వతి సత్యనారాయణ జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పించినట్లు జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న తెలిపారు. రాష్ట్ర కార్యదర్శిగా పెద్దకాపు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా చక్రాల హరిప్రసాద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు వీరికి జిల్లా అధ్యక్షుడు ఆదివారం నియామక పత్రాలు అందజేశారు. సంఘ అభివృద్ధి, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన సత్యనారాయణ, హరిప్రసాద్ తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప సేవాసమితి నూతన కార్యవర్గం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అయ్యప్ప భక్తులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మానస్ హోటల్‌లో అఖిలభారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని సంస్థ వ్యవస్థాపక సభ్యుడు కనపర్తి విఘ్నేశ్ అధ్యక్షతన విస్తరించారు. అంతకు ముందు చిన్నారుల నాట్య ప్రదర్శన, అయ్యప్పస్వామి పూజ, జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా తేలు శ్రీనివాస్, కార్యదర్శిగా రాజేశ్, కోశాధికారిగా సాదం ఆనంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయ్యప్ప దీక్షాపరులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యాచరణ చేపడతామని తెలిపారు. అనంతరం అయ్యప్ప సేవా సమితి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మూర్తి గురుస్వామి, బద్రి శ్రీనివాస్, జాప ప్రకాశ్, జిందం గోవర్ధన్, వేణుగోపాల్, సాయినాథ్, శివప్రసాద్, యువరాజ్, శరణ్య తదితరులు పాల్గొన్నారు.

అంతటా పేకాట!



- జిల్లాలో జోరుగా 'ముక్కలాట'
- ఎక్కడ అనువుగా ఉంటే అక్కడే..
- అటవీ ప్రాంతాల్లోనూ అడ్డాలు..
- గ్రూపులుగా వీడి ఆడుతున్న వైనం
- ఇన్నాళ్లు పట్టించుకోని పోలీసులు
- ఎస్పీ ఆదేశంతో పక్కాగా దాడులు

నిర్మల్: జిల్లాలో పేకాట మూడు పేకలు.. ఆరు ఆటలుగా సాగుతోంది. ఇందుకోసం పట్టణాల్లోని లాడ్జీలు, హోటళ్లతో పాటు పల్లెల్లోని తోటలు, అటవీప్రాంతాల్లోనూ ఎన్నో అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. ఏళ్లుగా ఈ ఆట జోరుగా కొనసాగుతున్నా.. ఇన్నాళ్లు పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారు. పెద్దమొత్తంలో పట్టుబడ్డా.. ఎప్పుడూ బట్టబయలు చేయలేదన్న ఆరోపణలున్నాయి. పేకాట కేసుల్లో కొంతమంది పోలీసులు చేతివాటం ప్రదర్శించడం జిల్లా అధికారుల దాకా వెళ్లింది. ఈక్రమంలోనే ఇటీవల భారీగా సిబ్బందిని మార్పులు చేసినట్లు చెబుతున్నారు. ఇటీవల ఫిర్యాదుల సంఖ్య కూడా పెరుగుతుండగా ఎస్పీ జానకీషర్మిల సీరియస్‌గా స్పందించారు. జిల్లాలో పేకాటపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. ఈమేరకు పోలీసులు మెరుపు దాడులు చేస్తూ పేకాటరాయుళ్లకు షాక్ ఇస్తున్నారు.

ఇల్లు గుల్ల చేసుకుంటూ..

ఒకప్పుడు పేకాట సరదాకు ఆడేవారు. ఇప్పుడు సంపాదన కోసం ఆడేవాళ్లూ ఉన్నారు. ఏదో ఉద్యోగానికో.. ఉపాధికో.. వెళ్లినట్లు పొద్దున్నే టిక్‌టాక్‌గా రెడీ అవుతూ పేకాడటానికి వెళ్తున్న బ్యాచులూ జిల్లాలో ఉన్నాయి. చిన్నమొత్తాల్లో సరదాకోసం ఆడే రోజులు కూడా పోయాయి. పెద్దమొత్తాలను పెడుతూ రోజంతా ఆడుతున్నారు. పేకాటలో సర్వం కోల్పోయి జిల్లాలో రోడ్డున పడుతున్న కుటుంబాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఆడేందుకు అప్పులపాలైనవాళ్లూ ఉన్నారు. కొంతమంది ఇల్లు, భూములనూ అమ్ముకున్నారు.

పోలీసుల చేతివాటం!

ఏళ్లుగా పేకాడుతున్న అడ్డాలు, ఆడేవాళ్లూ పోలీసులకు తెలిసినా ఎప్పుడూ పెద్దగా స్పందించలేదు. వాళ్ల దగ్గర మామూళ్లు తీసుకుంటారన్న ఆరోపణలు ఉండేవి. అలాగే పెద్దమొత్తంలో పేకాటలో డబ్బులు పట్టుబడ్డా.. పోలీసు సిబ్బంది చేతివాటం ప్రదర్శించి తక్కువ మొత్తంలో చూపేవారన్న ఆరోపణలున్నాయి. కొంతమంది రాజకీయ నేతలు, ప్రముఖులకు దాడుల విషయాన్ని ముందే సమాచారమిచ్చేవారన్న విమర్శలున్నాయి.

ఎస్పీ ఆదేశాలతో..

ఎస్పీగా జానకీషర్మిల బాధ్యతలు చేపట్టిన నుంచి శాఖాపరంగా తన మార్క్ చూపుతున్నారు. అవినీతి, అక్రమాల ఆరోపణలున్న సిబ్బందిపై సీరియస్‌గా చర్యలు తీసుకున్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం మొదలు ఠాణాల వరకు మొత్తం సిబ్బందిని మార్చేశారు. మొన్నటివరకు గంజాయిపై సీరియస్‌గా దాడులు చేయించిన ఎస్పీ తాజాగా పేకాటపై దృష్టిపెట్టినట్లు తెలుస్తోంది. మేడమ్ ఆదేశాల మేరకు పేకాట అడ్డాలపై దాడులు పెరిగాయి. వారం రోజుల్లోనే మూడుచోట్ల పెద్దమొత్తంలో పేకాటరాయుళ్లను పట్టుకున్నారు. ఇకముందూ ఇదే తీరులో దాడులు కొనసాగుతాయని చెబుతున్నారు.

పక్కాగా అడ్డాలు..

గల్లీలు, ఇళ్లల్లో ఆడితే చుట్టుపక్కల ఉన్నవారు సమాచారమిస్తే పోలీసులకు దొరికిపోతామని.. పేకాటరాయుళ్లు పక్కాగా పలు అడ్డాలు ఏర్పాటు చేసుకున్నారు. పట్టణాల్లోని పలు లాడ్జీలు, హోటళ్లలో గదులు అద్దెకు తీసుకుంటూ పేకాడుతున్నారు. పల్లెల్లో శివారు ప్రాంతాలు.. లేదంటే అటవీప్రాంతాల్లోకి వెళ్లి ఆడుతున్నారు. ఇక కొంతమంది వీఐపీ ఆటగాళ్లు రాజకీయ నేతలు, పేరున్న పెద్దల ఫాంహౌసులు, తోటల్లో అడ్డాలు పెట్టుకుంటున్నారు. ఒకప్పుడు పెద్దమొత్తంలో పేకాట ఆడాలంటే ఆర్మూర్, అంకాపూర్, నిజామాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్లేవారు. ఇప్పుడు ఇక్కడే ఇలా అడ్డాలు ఏర్పాటు చేసుకుని పెద్దమొత్తంలో ఆడుతున్నారు.

సమాచారమివ్వండి



జిల్లాలో ఎక్కడైనా గంజాయి అమ్ముతున్నట్లు గాని.. పేకాడుతున్నట్లు గాని సమాచారం ఉంటే పోలీసులకు తెలుపాలి. వాటిపై కచ్చితంగా చర్యలు చేపడతాం. చెడువ్యసనాలను పూర్తిగా నిర్మూలించి, జిల్లాలో ప్రశాంత వాతావరణం ఉంచడానికి ప్రజల సహకారం చాలా అవసరం.

– జానకీషర్మిల, ఎస్పీ

నకిలీ పెత్తనం!

- అనుమతిలేని బీటీ–3 విత్తనాలను రైతులకు విక్రయిస్తున్న వ్యాపారులు
- నమ్మి మోసపోతున్న జిల్లా రైతాంగం
- సకాలంలో పంపిణీ చేయని సర్కారు



నిర్మల్‌చైన్‌గేట్: ఖరీఫ్ ముంచుకువస్తోంది. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తున్నాయి. నేల బాగా నానడంతో రైతులు దుక్కులు దున్నుతున్నారు. పత్తి విత్తనాల సేకరణలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వం ఇప్పటికీ విత్తన కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకోలేదు. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు పంపిణీ చేసేందుకు ముందస్తు చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. వీరి అవసరాన్ని పలువురు వ్యాపారంగా మలుచుకుంటున్నారు. దీంతో ఏటా పొలాల్లో నకిలీ విత్తనాలు నాట్యం చేస్తున్నాయి. పంటను గులాబీ పురుగు తొలిచేస్తోంది. ఆశించిన దిగుబడులు రాక చివరకు రైతులు నష్టపోతున్నారు.

విత్తన ఎంపికపై అవగాహన లేక..

జిల్లాలో పత్తి రైతులను నకిలీ విత్తనాల బెడద తీవ్రంగా వేధిస్తోంది. అనుమతి లేని బీటీ–3 విత్తనాల కారణంగా దిగుబడులు కోల్పోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు విత్తన ఎంపికపై అవగాహన లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో వానాకాలం సీజన్ ప్రారంభం కానుండగా నకిలీ విత్తనాలకు చెక్ పెట్టాల్సిన అవసరం ఉంది.

పొరుగు రాష్ట్రాల నుంచి..

అనుమతి లేని బీటీ–3 పత్తి విత్తనాలను జిల్లాకు ఆనుకుని ఉన్న మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతంలోని కొన్ని జిల్లాలతోపాటు తెలంగాణలోని వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం తదితర జిల్లాల నుంచి ఇక్కడికి తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది. అక్రమ వ్యాపారులు నకిలీ విత్తనాలను జిల్లా రైతులకు అంటగడుతున్నారు. బ్రాండెడ్ విత్తనాల కంపెనీల కంటే నాణ్యతగల విత్తనాలను తక్కువ రేటుకే ఇస్తున్నామని రైతులను నమ్మించి మోసం చేస్తున్నారు. మార్కెట్‌లోకి వస్తున్న విత్తనాల్లో ఏవి అసలో.. ఏవి నకిలో.. పోల్చుకోలేక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. నకిలీ విత్తనాలతోపాటు వ్యాపారులు నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలను ఆంధ్ర, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ నుంచి రహస్యంగా జిల్లాకు తెప్పిస్తున్నారు. ఇక్కడ ప్యాకింగ్ కవర్లు మార్చి ద్విచక్రవాహనాల ద్వారా రైతుల ఇళ్ల వద్దకు వెళ్లి అమ్మకాలు సాగిస్తున్నారు. రైతులు కూడా నిషేధిత బీటీ–3 విత్తనాలపై ఆసక్తి చూపుతూ చివరకు నష్టపోతున్నారు.

ఉద్దెరకు అంటగడుతూ..

విత్తనాలపై పెద్దగా అవగాహన లేకపోవడం.. పైగా ఉద్దెరకు విత్తనాలు ఇస్తుండడంతో రైతులు వాటినే తీసుకుంటున్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామాల్లో వీటి విక్రయం అధికంగా ఉంది. 'ఇవి మంచి దిగుబడినిచ్చే కొత్తరకం విత్తనాలు.. కలుపుతీత లేకుండా మందులు పిచికారీ చేయొచ్చు' అంటూ వ్యాపారులు రైతులను మభ్యపెడుతున్నారు. దీంతో రైతులు దిగుబడి పెరిగి.. శ్రమ తగ్గుతుందన్న ఆశతో కొనుగోలు చేసి నష్టపోతున్నారు. ఈ పంట వేసిన మరుసటి ఏడాది కూడా దిగుబడులపై ప్రభావం చూపుతోంది. ఈ నకిలీ విత్తనాల వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న దుకాణాలనే టార్గెట్ చేసుకుని విక్రయాలు సాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నెల చివరివారం నుంచే పత్తి విత్తనాలను కొనుగోలు చేసే అవకాశం ఉన్నందున అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కుచ్చులు కొనుగోలు చేయాలి



ధాన్యం కుచ్చులను ఎస్పీకి ఇస్తున్న డీఆర్డీవో

నిర్మల్‌టౌన్: నిర్మల్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో తయారు చేసిన ధాన్యం కుచ్చులను ప్రతి ఒక్కరూ కొనుగోలు చేయాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. గ్రామీణాభివృద్ధి, మండల సమాఖ్య ఆధ్వర్యంలో తయారు చేసిన వరి ధాన్యం కుచ్చులను ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఆర్డీవో విజయలక్ష్మి ఎస్పీకి అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సమీకృత వ్యవసాయ క్షేత్రంలో సాగవుతున్న వరి కంకులను కొడవళ్లతో కోయించి శుభ్రపరిచి, ప్రత్యేక అల్లిక ద్వారా కుచ్చుగా తయారు చేసినట్లు తెలిపారు. వీటిని ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మోడల్ పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించారని పేర్కొన్నారు. ఈ కుచ్చులను కొనుగోలు చేసి ఇంటి ఆవరణలోగల బాల్కనీల్లో వేలాడదీస్తే పక్షులకు ఆహారం అందించినట్లవుతుందని తెలిపారు. ఇలా పూర్వకాలంలో ప్రతీ ఇంటి ఎదుట రైతులు వేలాడదీసేవారని, దీంతో వచ్చే పక్షులను లక్ష్మీ స్వరూపంగా భావించేవారని వివరించారు. వరి కుచ్చులు కావాలనుకునేవారు సంతోష్‌ను 9652004859, రవిని 9949123090 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జాతీయస్థాయి వుషూకు ఎంపిక



పతకాలు సాధించిన క్రీడాకారులు

భైంసాటౌన్: జాతీయ స్థాయి వుషూ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. ఈనెల 18న అమెచ్యూర్ వుషూ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లాకేంద్రంలో రెండో జూనియర్ రాష్ట్రస్థాయి వుషూ క్రీడల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఇందులో జిల్లా, ఖేలో ఇండియా వుషూ కేంద్రం నుంచి 10 మంది (నలుగురు బాలికలు, ఆరుగు బాలురు) క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో దావుషు విభాగంలో జీ అనన్య (భైంసా), 60 కేజీల విభాగంలో అలెక్ (భైంసా), 80 కేజీల విభాగంలో హర్షవర్ధన్ (భైంసా) బంగారు పతకాలు సాధించారు. దావుషు విభాగంలో ఎస్.విద్య (గోడాపూర్), 48 కేజీల విభాగంలో ఎస్.రాంచరణ్ (పాంగ్రి), 56 కేజీల విభాగంలో ఆకాశ్ (కోలూరు) రజత పతకాలు దక్కించుకున్నారు. 45 కేజీల విభాగంలో డీ సమీక్ష (భైంసా), 52 కేజీల విభాగంలో త్రిశూల్ (భైంసా), 55 కేజీల విభాగంలో సాయి కమల్ (ఓని) కాంస్య పతకాలు సాధించారు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు జూన్ 26 నుంచి 31వ తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూర్‌లో జరిగే 23వ జాతీయస్థాయి వుషూ పోటీల్లో పాల్గొననున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా క్రీడల అధికారి నాఫేఖాన్, వుషూ అధ్యక్షులు శివరాజ్‌గౌడ్, రాజశ్రీ, సాయినాథ్ (కోచ్), నితిన్‌గౌడ్, జ్ఞానతేజ, లింగం అభినందించారు.



లోకేశ్వరం: మన్మద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు



సోన్: సాన్వీ ఫంక్షన్‌హాల్‌లో పూర్వవిద్యార్థులు

అ'పూర్వ'ం.. ఆత్మీయ సమ్మేళనం

లోకేశ్వరం: మండలంలోని మన్మద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994–1995 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్నవారంతా తిరిగి ఇదే స్కూల్‌లో ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నారు. పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. అప్పటి ప్రధానోపాధ్యాయుడు రుక్మారెడ్డి, ఉపాధ్యాయులు రమేశ్, సురేశ్‌ఖర్, లింగన్న, రవీందర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, లింగయ్య, నారాయణ, మల్లారెడ్డి, రాజేశ్వర్‌ను సన్మానించారు.

సోన్: సోన్ జెడ్పీ హైస్కూల్లో 1998–1999 విద్యాసంవత్సరంలో ఎస్సెస్సీ పూర్తి చేసిన పూర్వవిద్యార్థులు సాన్వీ ఫంక్షన్‌హాల్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డవారంతా ఒక్కచోట చేరి సందడి చేశారు. రోజంతా సరదాగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం నృత్యాలతో అలరించారు. పూర్వ ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, పత్తి శివప్రసాద్, చందర్, రాజేశ్వర్, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీవాణి విద్యానికేతన్ పాఠశాలలో 1990–1991 పదోతరగతి చదివిన పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అంతా ఒక్కచోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. రోజంతా సరదాగా గడిపారు. హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు పుండలిక్‌రావు పాటిల్, వినాయకరావు, గంగాధర్, కర్మచారి, రమేశ్‌ను సన్మానించారు. పూర్వ విద్యార్థులు హనుమంతారావు, లక్ష్మణ్, కిరణ్మయి, వనిత, మధుర, మాణిక్, మధుకర్, ముత్యంరెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులున్నారు.

బాసరలో భక్తుల రద్దీ



చిన్నారితో అక్షరాభ్యాసం చేయిస్తున్న అర్చకుడు

భైంసా: జిల్లాలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రమైన బాసర ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు కావడంతో చాలామంది తమ చిన్నారులకు ఆలయంలో అక్షరాభ్యాసాలు చేయించారు. ముందుగా గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం జ్ఞాన సరస్వతీ అమ్మవారి దర్శించుకున్నారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి అధికసంఖ్యలో భక్తులు వచ్చారు. ఆలయ ఈవోతో పాటు సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

నిర్మల్ రూరల్: ఈ నెల 24నుంచి నిర్వహించనున్న ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని డీఐఈవో పరశురాం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆక్రమణల చెరలో బైపాస్!



బైపాస్ వంతెన వద్ద పారబోసిన చెత్త



బైపాస్ వంతెన వద్ద సుద్దవాగు కట్టను ఆనుకుని ఆక్రమణ

భైంసాటౌన్: పట్టణంలోని ఆటోనగర్‌కు వెళ్లే బైపాస్ వంతెన నానాటికీ కుంచించుకుపోతోంది. గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు దిగువన సుద్దవాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. కొందరు వంతెన సమీపంలో నేలను చదును చేసి ఆక్రమించుకుంటున్నారు. ఇసుక కుప్పలు పోసి దర్జాగా దందా చేస్తున్నారు. మరికొందరు వంతెన వద్ద చెత్త పారబోస్తుండడంతో వంతెన కింద బ్లాక్‌లు పేరుకుపోతున్నాయి. వంతెనకు ఒకవైపు పెద్దపెద్ద రాళ్లతో పెద్ద ఎత్తున కట్టగా ఏర్పాటు చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో గడ్డెన్నవాగు ప్రాజెక్ట్ నుంచి నీటిని విడుదల చేసిన సందర్భాల్లో వరదనీరు పారే దారి లేక నివాస ప్రాంతాల్లోకి చొచ్చుకువస్తోంది. గతంలో పలుసార్లు ఈ విషయమై 'సాక్షి' కథనాలు ప్రచురించింది. అయినా అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించడం లేదు. రానున్నది వానాకాలం కావడంతో గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌కు భారీగా వరదనీరు వచ్చి చేరే అవకాశముంది. గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలినప్పుడు దిగువనున్న బైపాస్ వంతెన వద్ద ఆక్రమణలతో పట్టణంలోని సుద్దవాగు పరీవాహక ప్రాంతంలోని నివాసాల్లోకి వరదనీరు చేరుతోంది. దీంతో ఆయా కాలనీల్లో ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు బైపాస్ వంతెన వద్ద ఆక్రమణలు తొలగించి వరదనీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఆష్ట వాసికి పరిశోధనాపత్రం



ప్రశంసాపత్రం అందుకుంటున్న వెంకటరమణారెడ్డి

ముధోల్: ఆష్ట గ్రామానికి చెందిన ఏనుగు వెంకటరమణారెడ్డి అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఎస్ఎల్‌సీ ఇండియా కేస్ స్టడీ అంశంపై ఉత్తమ పరిశోధన పత్రాన్ని యూనివర్సిటీ ప్రొఫెసర్, కోడైరెక్టర్ వెంకటయ్య చేతుల మీదుగా అందుకున్నారు. 'భారతదేశంలో 10 సంవత్సరాల సీఎస్ఆర్ అవలోకనం–ఎస్ఎల్‌సీ ఇండియా కేస్ స్టడీ' అంశంపై అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రభుత్వ పరిపాలన విభాగంలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో పరిశోధన పత్రాన్ని అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనను మండలవాసులు అభినందించారు.

రైతువేదికలకు అందని నిధులు

- ఏడాదిగా కొరవడిన నిర్వహణ
- నెలకు రూ.9వేలు రాని వైనం
- నిరుపయోగమవుతున్న వేదికలు
- ఆర్థిక ఇబ్బందుల్లో ఏఈవోలు



నిరుపయోగంగా తాంద్ర రైతువేదిక
ఏడాదిగా అందని నిధులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో రైతువేదికలు నిరుపయోగమవుతున్నాయి. ఏఈవోలు అందుబాటులో ఉండి రైతులకు సాగులో సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం వీటిని నిర్మించింది. జిల్లాలో 396 గ్రామపంచాయతీల్లోని 79 క్లస్టర్లలో రైతువేదికలు నిర్మించేందుకు ప్రభుత్వం ఒక్కోదానికి రూ.22 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఈ నిధులతో వేదికలు నిర్మించి 2021నుంచి అందుబాటులోకి తెచ్చింది. కానీ.. వీటి నిర్వహణకు నిధులు సకాలంలో విడుదల చేయడం లేదు. దీంతో ఏఈవోలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ బిల్లులు, పారిశుధ్యం, ఇతర నిర్వహణ ఖర్చులు భారంగా మారాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతువేదిక నిర్వహణకు నెలకు రూ.9వేల చొప్పున ఖర్చు అవుతుందని గత ప్రభుత్వం అంచనా వేసింది. వాటిలో విద్యుత్ బిల్లులకు రూ.వెయ్యి, రైతుల శిక్షణకు రూ.2,500, పారిశుధ్య నిర్వహణకు రూ.3వేలు, తాగునీటికి రూ.500, మరమ్మతు, స్టేషనరీ, జిరాక్సులు, ఇతర ఖర్చులకు రూ.2 వేలు వెచ్చించాల్సి ఉంది. ఈ మేరకు రైతువేదికలకు గతేడాది ఏప్రిల్ వరకు నిధులు విడుదలయ్యాయి. అప్పటి నుంచి నిలిచిపోవడంతో రైతువేదికల నిర్వహణ భారంగా మారిందని ఏఈవోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించడం తలకు మించిన భారమైందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న రైతు వేదికల నిర్వహణ నిధులు త్వరగా విడుదల చేయాలని వారు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



రైతువేదికలకు నిర్వహణ నిధులను ప్రభుత్వం త్వరగా విడుదల చేయాలి. లేదంటే రైతు వేదికలు నిరుపయోగంగా మారే అవకాశముంది. రైతులకు పంటల సాగులో సూచనలు, సలహాలు అందించేందుకు, సమావేశాలు నిర్వహించేందుకు వీటిని వినియోగించాలి.

– పుప్పాల రవికుమార్, రైతు, పెంబి

క్లుప్తంగా

ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: ట్రిపుల్ తలాక్ చెప్పిన పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన అబ్దుల్ అతీఖ్‌ను జడ్జి ఎదుట హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు మహిళా పోలీసు స్టేషన్ సీఐ జి.శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ట్రిపుల్ తలాక్ చెప్పిన వ్యక్తిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, ఆదివారం ఆయన్ను జడ్జి ముందు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామన్నారు.

15 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు


వాహనం తనిఖీ చేస్తున్న ఎస్సై రాము

బోథ్: మద్యం తాగి వాహనాలు నడిపిన 15 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై రాము తెలిపారు. మండలంలోని కుచులాపూర్ గ్రామంలోని వేంకటేశ్వర ఆలయం వద్ద ఆదివారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. పలువురికి డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు చేయగా మద్యం తాగినట్లు రుజువైంది. వారిపై కేసులు నమోదు చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు యజమానిపై కేసు నమోదు చేస్తామన్నారు.

ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: బైక్‌తో ఢీకొన్న ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదైనట్లు టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత రెండురోజుల క్రితం పట్టణంలోని కిసాన్‌చౌక్ ప్రాంతంలో అతీష్‌బాబు, కృష్ణ బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. డివైడర్ నుంచి యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మరో బైక్ వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో అతీష్‌బాబు, కృష్ణలకు గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

భార్యను చంపిన భర్త

ఇచ్చోడ: భార్యని భర్త హత్య చేసిన ఘటన ఇచ్చోడ మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ కథనం ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం సత్యజీగూడకు చెందిన రేణుక (28), ఇచ్చోడ మండలం గాంధీనగర్‌కు చెందిన గుట్ట వెంకట్‌తో 2015లో పెళ్లి జరిగింది. వెంకట్ వ్యవసాయం పని చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పెళ్లయినప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యతో గొడవపడేవాడు. శనివారం సాయంత్రం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. మద్యం మత్తులో రేణుకను తాడు బిగించి హత్యచేసి పరారయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఎస్సై నరేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

WANTED
Qualified
M.Sc. Nursing,
B.Sc. Nursing
faculty to teach
in our College.
SRKM College of Nursing
ESTD: 2003
Mancherial- T.S.
Cell: 9866231292, 9866509614, 8374585229

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సాప్ చేయగలరు. 9502615217. [M-1185083]
■త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ. 18K ఫోన్: 9160900024/9640400073 [H-799880]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

ఇక 'చేనేత' ఎన్నికలు

- 12 ఏళ్లకు మోక్షం
- ఉమ్మడి జిల్లాలో రెండు సంఘాలు
- ఎన్నికలకు అధికారుల కసరత్తు

చెన్నూర్: చేనేత సహకార సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పన్నెండేళ్ల తర్వాత ఎన్నికలకు మోక్షం లభించింది. ఎన్నికల నిర్వహణ కోసం చేనేత జౌళిశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రెండు చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో మంచిర్యాల జిల్లా చెన్నూర్, కుమురం భీం జిల్లాలోని బెజ్జూర్‌లో సంఘాలు ఉన్నాయి. అధికారులు సభ్యుల జాబితాలు సిద్ధం చేస్తున్నారు. మొత్తం 240 మందికి పై సభ్యులు ఉన్నారు.

ఆరేళ్లుగా పర్సన్ ఇన్‌చార్జిలే..
చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఫిబ్రవరి 11, 2013న ఎన్నికలు జరిగాయి. వీటి గడువు 2018 ఫిబ్రవరి 12న ముగిసింది. పదవీ కాలం ముగిసిన వెంటనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా జీవో 568 ప్రకారం పర్సన్ ఇన్‌చార్జీలను నియమించింది. 2018 ఫిబ్రవరి నుంచి 2023 ఆగష్టు వరకు పర్సన్ ఇన్‌చార్జీలతో సహకార సంఘాల్లో కార్యకలాపాలు నిర్వహించారు.


మగ్గం వేస్తున్న చేనేత కార్మికుడు

ఉమ్మడి జిల్లాలో నాడు 8 సంఘాలు..
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఒకప్పుడు పది చేనేత సహకార సంఘాలతో జిల్లాలో చేనేత వస్త్రాలకు పెట్టింది పేరుగా నిలిచింది. సుమారు 8 వేల కుటుంబాలకు చేనేత సంఘాలపై ఆధారపడి జీవనం సాగించారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో సంఘాలు ఢీలా పడ్డాయి. ఆదిలాబాద్, నిర్మల్, లక్సెట్టిపేట, మంచిర్యాల, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లో సంఘాలు మూతపడ్డాయి. ప్రస్తుతం చెన్నూర్, బెజ్జూర్‌లో రెండు చేనేత సహకార సంఘాల్లో కార్మికులు వస్త్ర ఉత్పత్తి చేస్తున్నారు.

చెన్నూర్ సంఘంలోనే అత్యధిక..
చెన్నూర్ చేనేత సహకార సంఘంలో కార్మికులు ఎక్కువ సంఖ్యలో మగ్గాలు నేస్తున్నారు. సుమారు 140 మందికి పైగా కార్మికులు ఉండగా బెజ్జూర్‌లో వంద మంది మాత్రమే కార్మికులు ఉన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాకే..



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలోని చేనేత సహకార సంఘాల ఓటరు జాబితాలను సిద్ధం చేస్తున్నాం. పర్సన్ ఇన్‌చార్జీల పదవీ కాలం ముగిసింది. కొత్తగా ఎవరికి చార్జీ ఇవ్వలేదు. సంఘాల బలోపేతం కోసం ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే ఎన్నికలు నిర్వహిస్తాం.
– చరణ్ చేనేత జౌళిశాఖ కరీంనగర్, ఉమ్మడి ఆదిలాబాద్ ఏడీ

పాటే ప్రాణం.. నటనే జీవనం!

- సంస్కృతి..సంప్రదాయాలకు నిదర్శనం
- రాణిస్తున్న ప్యాదరి మహేందర్


స్టూడియోలో గీతాన్ని ఆలపిస్తున్న మహేందర్


మహేందర్‌ను సన్మానిస్తున్న పాటే మా ప్రాణం సంగీత అకాడమీ సభ్యులు

కుంటాల: పాటకు ప్రాణం పోస్తూ.. నటనలో జీవిస్తూ.. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ పల్లెప్రజలను చైతన్య పరుస్తున్నారు కుంటాలకు చెందిన ప్యాదరి మహేందర్. ప్యాదరి పోసాని–గజ్జారాం దంపతుల కుమారుడు మహేందర్. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తూ తీరిక సమయాల్లో పాటలు పాడుతూ.. నటిస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు.

ఇలా మొదలైన ప్రస్థానం..
కుంటాల ఇలవేల్పు శ్రీగజ్జలమ్మదేవి నూతన ఆలయ నిర్మాణం సందర్భంగా 'కొత్త గుడిని కట్టాం.. గజ్జలమ్మ'! అనే పాటను గాయని మధుప్రియతో కలిసి పాడేందుకు ప్రముఖ సినీ, గేయ రచయిత ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించారు. ఇందులో మహేందర్‌కు మధుప్రియతో కలిసి పాడేందుకు అవకాశం దక్కింది. నటుడు, సినీ, గేయ రచయిత తాటి శివ, కవులు, రచయితలు ముజ్జి రవి, అన్వేష్


రైతుగోస ఆడియో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

సిందె, శ్రీకాంత్, స్నేహితులు, తోటి ఉపాధ్యాయుల సహకారం లభించింది. కులవృత్తులు ఆధ్యాత్మిక, ప్రజల్ని చైతన్యపరుస్తూ సుమారు 55 పైగా పాటలు పాడి ప్రేక్షకుల మనసులను దోచేశారు.

నటనలో దిట్ట..
తీరిక సమయం దొరికినప్పుడల్లా పాటలు పాడుతూ..బుల్లితెరపై నటిస్తూ తనదైన పాత్ర పోషిస్తున్నాడు మహేందర్. కుంటాల ఇలవేల్పు శ్రీగజలమ్మ దేవి, కల్లూర్ సాయిబాబా, అంబకంటి అంజన్న, కుంటాల ప్రాచీన శ్రీకృష్ణ, కదిలి పాపహరేశ్వర, సిరాల శివాలయాల విశిష్టతను వివరిస్తూ..జై భీమ్ జై భీమ్ అంటూ..గోమాత, ఐక్యత పాటల రూపంలో నటించారు. భైంసాకు చెందిన నిర్మాత కొత్తూరు శంకర్, రచయిత గంధం శ్రీనివాస్, హీరో గంధం స్నేహిత్ నటించిన ప్రేమలోల్లి సినిమాలో లవ్ ఫెయిల్యూర్ పాట ద్వారా తొలిసారి వెండితెరకు పరిచయమయ్యాడు. బతుకమ్మ పండుగ, జానపద పాటలను పాడుతూ నటిస్తూ అందరినీ మెప్పించి ఒప్పిస్తున్నాడు.

అందరి సహకారంతో..
తొలిసారిగా గజ్జలమ్మ పాట పాడే అవకాశం మధుప్రియతో కలిసి దక్కింది. అప్పటినుంచి పాటలు పాడడంతో పాటు నటనపై అభిరుచి పెరిగింది. అందరి సహకారం లభించింది. పాట, నటనను అందరూ ఆదరించడం సంతోషంగా ఉంది.
– ప్యాదరి మహేందర్

చికిత్సపొందుతూ ఒకరి మృతి

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా అంద్‌బోరి గ్రామానికి చెందిన రాథోడ్ తులసీరాం నాయక్ రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై లాల్ సింగ్ నాయక్ కథనం ప్రకారం.. తులసీరాం పెళ్లి కోసం పలువురు అమ్మాయిలను చూసినప్పటికీ పెళ్లి కావడం లేదని మానసిక వేదనకు గురయ్యాడు. ఈనెల 16న తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వివరించాడు.

డ్రైవర్..
ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల మహారాష్ట్రలోని పిప్పల్ కోటి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలైన లారీడ్రైవర్ చిన్నరామయ్య (72) రిమ్స్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. టూటౌన్ ఎస్సై లాల్‌సింగ్ నాయక్ కథనం ప్రకారం..గత నాలుగు రోజుల క్రితం పిప్పల్‌కోటి వద్ద రెండు లారీలు ఢీకొన్నాయి. గాయాల పాలైన చిన్నరామయ్యను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా ఈయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లాలోని రాంపూర్ మండలం పలానపూరి పల్లెకు చెందినవాడని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పిచ్చికుక్కదాడిలో పలువురికి గాయాలు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజవ్వ, లక్ష్మణ్, లక్కీ, జనార్దన్‌కు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

కౌటాల/కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి గుర్తుతెలియని యువకుడు (28) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నట్లు కాగజ్‌నగర్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపారు. మృతుడి ఎడమ చేతి పై కుంత అని, కుడి చేతి భుజం పై త్రిశూల్ సింబల్ పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు.
మృతుడు షర్టు ధరించలేదని, బూడిద కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని సిర్పూర్(టి)లోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు పేర్కొన్నారు. ఇతని వివరాలు తెలిస్తే 8712658596, 8712658605 సెల్‌నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అదనపు కట్నం కోసం వేధించిన ఐదుగురిపై కేసు

నెన్నెల: అదనపు కట్నం కోసం వేధించిన భర్త, మామ, అత్తతోపాటు ఆడబిడ్డ, ఆమె భర్తపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లికి చెందిన నాగుల మల్యాల రాజు, నెన్నెల మండల కేంద్రానికి చెందిన మౌనికతో గతేడాది జూన్ 14న వివాహం జరిగింది. పెళ్లి ఖర్చు కింద రూ.3 లక్షలు నగదు, తులం బంగారాన్ని మౌనిక తల్లిదండ్రులు ఇచ్చారు. సుమారు 3 నెలల పాటు సజావుగా సాగిన వారి కాపురంలో గొడవలు మొదలయ్యాయి. అదనపు కట్నం, మరో రూ.3 లక్షలు తీసుకురావాలంటూ భర్త రాజు, అత్త నాగుల మల్యాల అమ్మాయి, మామ ఆనందంలతోపాటు ఆడబిడ్డ బ్రమ్మోజు స్వప్న, ఆమె భర్త రవిబాబు వేధించసాగారు. పెళ్లయిన 15 రోజుల నుంచే అదనపు కట్నం తేవాలని భర్త రాజు ఇంట్లో తలుపులు పెట్టి చిత్రహింసలు పెట్టేవాడని పేర్కొన్నాడు. బాధితురాలు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

ప్రజారోగ్యంతో చెలగాటం


సీజ్ చేసిన మామిడిపండ్ల లారీలతో అధికారులు

- రసాయనాలతో మామిడి పండ్లుగా మార్చుతున్న వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధంగా తీసుకెళ్తున్న ఐదు లారీలు సీజ్

ఆదిలాబాద్‌టౌన్: ప్రజల ఆరోగ్యంతో కొందరు వ్యాపారులు చెలగాటం ఆడుతున్నారు. వేసవి సీజన్‌లో లభించే మామిడి పండ్లను ఇథైల్, ఇథేఫాన్ ప్రమాదకర రసాయనాలతో మాగబెట్టి విక్రయిస్తున్నారు. ఎక్కువ మోతాదులో రసాయనాలు వేసి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్న ఐదు లారీల మామిడి పండ్లను ఫుడ్ సేఫ్టీ అధికారులు సీజ్ చేశారు. ముందస్తు సమాచారంతో ఫుడ్ సేఫ్టీ జోనల్ ఇన్‌చార్జి అమృతశ్రీ శనివారం మావల సమీపంలోని దేవాపూర్ చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేయగా నిబంధనలకు విరుద్ధంగా మామిడి పండ్లను తరలిస్తున్న లారీలను స్వాధీనం చేసుకున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా..
ఖమ్మం, వరంగల్, జగిత్యాల, బాటసింగారం తదితర జిల్లాల నుంచి ఆదిలాబాద్ జిల్లా మీదుగా హర్యానా, ఇతర ప్రాంతాలకు మామిడి పండ్లు తరలిస్తున్నారు. ఒక ప్యాకెట్ 10 కిలోల మామిడి పండ్లకు తగలకుండా వాటిని ఉంచాల్సి ఉంటుంది. అయితే ఈ పట్టుబడ్డ లారీల్లో ఒక్కొక్క డబ్బాలో 5 నుంచి 6 ప్రమాదకర రసాయనాలను ఉంచారు. దీంతో చిన్నపిల్లలతోపాటు పెద్దలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యాధికారులు చెబుతున్నారు. గత నెలరోజులుగా ఆదిలాబాద్‌తోపాటు ఇతర జిల్లాల్లో మామిడి పండ్ల విక్రయాలు ఎక్కువగా జరుగుతున్న దృష్ట్యా వినియోగదారుల ఫోరం సభ్యులు ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వాహనాల తనిఖీలు చేపట్టారు.

జిల్లాలోనూ ఇదే తంతు..
జిల్లాలో ఫ్రూట్స్ వ్యాపారులు కొందరు నిబంధనలకు విరుద్ధంగా రసాయనాలను వాడుతూ విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో పండ్లను కొనుగోలు చేస్తున్న జనాలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆదిలాబాద్ సమీపంలోని గోదాముల్లో పండ్లను నిల్వ ఉంచుతున్నారు. ఇతర జిల్లాల నుంచి కాయలుగా తీసుకొచ్చి వారి అవసరం మేరకు రసాయనాలను వాడి పండ్లుగా మార్చుతున్నారు. మామిడి, అరటి, సపోటాలు, బొప్పాయి తదితర పండ్లపై రసాయనాలను వినియోగిస్తున్నారు. తనిఖీలు చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు కేవలం వాహనాలు మాత్రమే సీజ్ చేయగా, పట్టణంలోని ఏ ఒక్క ఫ్రూట్ షాప్‌లు, గోదాములను తనిఖీలు చేపట్టలేదు. ఒకవేళ తనిఖీలు జరిపితే రసాయనాలు బయటపడేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఆరోగ్యం కోసం జనాలు పండ్లను కొనుగోలు చేస్తుంటే రసాయనాల కారణంగా అనారోగ్యం బారిన పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇదిలా ఉండగా, వివిధ కారణాలతో అనారోగ్యం బారిన పడ్డ రోగులను పరామర్శించేందుకు వెళ్లేవారు సైతం వారికి పండ్లను తీసుకెళ్తుండటం గమనార్హం.

మద్యం మత్తులో బీరు సీసాతో ఒకరిపై దాడి

- రిమ్స్‌కు తరలింపు
- కేసు నమోదు


పెంబి పీహెచ్‌సీలో ఆత్రం సోనేరావు

పెంబి: మద్యం మత్తులో బీరు సీసాతో ఒకరిపై దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. ఉట్నూర్‌లోని రాజంపేటకు చెందిన ఆత్రం సోనేరావు శనివారం పెంబి మండలం పస్పుల గ్రామంలో తన బంధువుల పెళ్లికి వచ్చాడు. అనంతరం తన స్నేహితులు జంగు, కైలాష్‌తో కలిసి వైన్స్ షాపు వద్దకు వచ్చి మద్యం తాగుతున్నారు. అక్కడే ఉన్న పెంబికి చెందిన పాకల సంతోష్ మద్యం మత్తులో సోనేరావు జేబులో చేయి పెట్టాడు. చేయి ఎందుకు పెట్టావంటూ వారి మధ్య వాగ్వాదం జరిగింది. సంతోష్ పక్కనే ఉన్న బీరు సీసాను పగులగొట్టి సోనేరావు మెడపై పొడిచాడు. తీవ్ర రక్తస్రావమైన అతన్ని స్నేహితులు పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించారు. సోనేరావు బంధువు ఆత్రం వసంత్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, సంతోష్‌ని అదుపులో తీసుకున్నామని ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి ఒకరు మృతి

పెంబి: చేపలవేటకు వెళ్లి ఒకరు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన చుంచు లస్మయ్య (41) శనివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం ఎంత వెతికిన దొరకలేదు. ఆదివారం ఉదయం గ్రామ సమీపంలోని కుంటలో మృతి చెంది ఉండడంతో స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకున్నారు. ఎస్సై శంకర్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుమారుడు శంకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాంధీ విగ్రహం ధ్వంసం

తాంసి: భీంపూర్ మండలం నిపాని గ్రామంలో గాంధీ విగ్రహాన్ని శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి కారు అద్దాలను పగులగొట్టారు. ధ్వంసమైన విగ్రహాన్ని ఆదివారం గ్రామస్తులు గమనించి భీంపూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై ప్రదీప్ కుమార్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ధ్వంసమైన గాంధీ విగ్రహం

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

ఖానాపూర్: మండలంలోని బీర్నంది గ్రామానికి చెందిన ఉపాధి కూలీ జాడి గంగవ్వ(43) వడదెబ్బతో మృతిచెందింది. ఈనెల 15న వడదెబ్బతో అస్వస్థతకు గురికాగా, ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స పొందింది. గురువారం ఖానాపూర్, శుక్రవారం నిర్మల్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంది. శనివారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలికి భర్త లింగన్న, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.


జాడి గంగవ్వ(ఫైల్)


రామకృష్ణాపూర్: సీవీ రామన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



తాంసి: కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు


మంచిర్యాలటౌన్: ఎంవీఎస్ డిగ్రీ డిగ్రీ పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం


జైనథ్: గురువులతో పూర్వ విద్యార్థులు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సీవీ రామన్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 25 ఏళ్ల అనంతరం సుమారు 150 మంది పాఠశాలలో కలుసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలను జరుపుకున్నారు. ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తీపిగుర్తులను నెమెరువేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. అప్పటి పాఠశాల కరస్పాండెంట్ గురిజాల రవీందర్‌రావు, హెచ్ఎంలు సురేందర్‌రావు, పెద్దపెల్లి ఉప్పలయ్య, చిరంజీవి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. గురిజాల రవీందర్‌రావు రచించిన బొగ్గరవ్వలు పుస్తకాన్ని కార్యక్రమంలో ఆవిష్కరించారు.

ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో..
మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మైక్రో బయాలజీ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత ఆదివారం కలుసుకున్నారు. విద్యార్థులంతా ఒకచోట చేరి సందడి చేశారు. చదువుకునే రోజుల్లో జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సహ విద్యార్థి జిల్లా రచయితల వ్యవస్థాపక అధ్యక్షుడు బొడ్డు మహేందర్‌ను సన్మానించారు. రాజేశ్, మల్లాగౌడ్, రమేశ్, నరేశ్, స్రవంతి, స్వప్న, హారిక, అనిత, సురేశ్ పాల్గొన్నారు.

కప్పర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..
తాంసి: మండలంలోని కప్పర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. 34 ఏళ్ల అనంతరం దాదాపు 50మంది పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను నారాయణ రెడ్డి, రత్నాకర్‌రెడ్డి, సుదర్శన్ తదితరులను సన్మానించారు.


కుభీర్ ఉన్నత పాఠశాలలో..

జైనథ్‌లో..
జైనథ్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒకచోట చేరారు. పాఠశాలలో పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

కుభీర్‌లో..
కుభీర్: కుభీర్ ఉన్నత పాఠశాలలో 2004–05 బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. పాత జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. మేమున్నాం ట్రస్ట్ ద్వారా విరాళాలు సేకరించి తోటివారిని ఆదుకుంటామన్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.